# ప్రతిపాదనలకే పరిమితం

- కాజీపేటలో గ్రంథాలయానికి స్థలం కేటాయింపులో జాప్యం
- అద్దె భవనంలో కొనసాగుతున్న లైబ్రరీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు, ఉద్యోగార్థులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు


కాజీపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం


గ్రంథాలయం ప్రతిపాదిత స్థలం

కాజీపేట: కాజీపేట పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కావడంతో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయ ఉద్యమస్ఫూర్తితో మూడున్నర దశాబ్దాల క్రితం కాజీపేటలో ఏర్పాటైన గ్రంథాలయం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. సరైన స్థలం లేకపోవడంతో మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని రెండు షాపింగ్ కాంప్లెక్స్ గదులను అద్దెకు తీసుకొని అతి కష్టం మీద కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

**విన్నపాలు బుట్టదాఖలు**

జిల్లా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలకు సమానంగా విలువైన అనేక గ్రంథాలు ఉన్నప్పటికీ సౌకర్యాలు కొరవడడంతో పాఠకులు, ఉద్యోగార్థులు పూర్తి స్థాయిలో లైబ్రరీని ఉపయోగించుకోలేకపోతున్నారు. సొంత భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని పాఠకులు చేసిన అనేక విన్నపాలు బుట్టదాఖలయ్యాయి. విలువైన ఫర్నిచర్, అమూల్యమైన గ్రంథాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఎన్నో ఉన్నా.. గదులు సరిపోక ఎక్కడ పెట్టాలో తెలియక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది గ్రంథాలయానికి వస్తుంటారు. అయితే, పట్టుమని పదిమంది పాఠకులు కూర్చునే స్థలం కూడా లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో నిలబడే పత్రికలు, పుస్తకాలు చూసి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

**ప్రత్యామ్నాయంపై దృష్టి**

కాజీపేట చౌరస్తాకు కూతవేటు దూరంలో కూలిపోయి శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన పాత మున్సిపల్ భవనం స్థలాన్ని గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కేటాయించాలనే ప్రతిపాదనలు సీఎం కార్యాలయంలో మూలకుపడి ఉన్నాయి. కాజీపేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే రూ.50 లక్షలను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు గత చైర్మన్ ప్రకటించారు. ఏడేళ్ల క్రితం ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి మున్సిపల్ కమిషనర్ నుంచి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించినా అనుమతి లభించకపోవడం చర్చనీయంశంగా మారింది. అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎమ్మెల్యే నాయినిపైనే ఆశలు**



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి కాజీపేట చౌరస్తా సమీపంలో ఉన్న పాత మున్సిపల్ భవన స్థలాన్ని గ్రంథాలయ శాఖకు కేటాయించేలా చర్యలు చేపట్టాలి. గతంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నాయిని పని చేసినప్పుడు ఈ స్థలాన్ని లైబ్రరీకి కేటాయించడానికి కృషి చేశారు.

– దవా సుధాకర్, కాజీపేట

**ఇరుకు గదులతో ఇబ్బందులు**



అనేక విలువైన పుస్తక సంపద అందుబాటులో ఉన్నా వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. రెండు అద్దె గదుల్లో ఒకటి పత్రిక పఠనానికి, ఇంకొకటి పుస్తకాలను నిల్వచేయడానికి ఉపయోగిస్తున్నారు. దాంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– బొక్క రమేష్, బాపూజీనగర్

## క్లుప్తంగా

### రేపటి నుంచి ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ మహిళల టోర్నమెంట్ ఈనెల 21న ఉదయం బొల్లికుంటలోని వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ప్రారంభమవుతుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, విశ్వంభర ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

### సీపీని కలిసిన ఏసీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్క అందజేశారు.

### వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



హన్మకొండ: వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హైదర్ సూచించారు. హనుమకొండలోని గాంధీనగర్‌లో లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి ప్రారంభించగా డాక్టర్ హైదర్ మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాలు వ్యాప్తి చెందుతున్న క్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ బాబు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ రవీందర్, ఏఎన్‌ఎం సుజాత, ఆశ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందించాలి



కాజీపేట: ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన హామీని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని యువ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు ఆ దిశగా చొరవ తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాజీపేట ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆటో డ్రైవర్ల సమస్యలపై గురువారం చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇంగె శ్రీకాంత్, దార సూరి, సార మహేందర్, సాంబరాజు, మంద సతీష్, పరబ్రహ్మాచారి, కట్ల శివ, క్యాతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి



హసన్‌పర్తి: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్ కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.5వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300ల చొప్పున కమీషన్ ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డీలర్లకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్ డీలర్లు మేకల తిరుపతి, నమిండ్ల రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### ‘ఫార్మసీ డీన్‌తో ప్రాణహాని’

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యతో తనకు ప్రాణహాని ఉందని బహుజన విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ తెలిపారు. ఈమేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేయూ ఫార్మసీ విభాగంలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను మెరిట్ ప్రకారమే భర్తీ చేయాలని కోరినందుకు తన పట్ల దుర్భాషలాడారని మనోహర్ పేర్కొన్నారు.

## అలుమ్నీ మీట్ ఇన్విటేషన్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో అలుమ్నీ మీట్‌ను ఈనెల 22న ఉదయం నిర్వహించనున్నారు. ఈమేరకు ది గ్రేట్ రీయూనియన్ పేర నిర్వహించనున్న పొలిటికల్ సైన్స్ విభాగం అలుమ్నీ మీట్‌కు సంబంధించిన ఇన్విటేషన్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం, బీఓఎస్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్, స్కాలర్ కళ్లెపెల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిని మార్చారు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం గంటూరుపల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్‌ను విధుల నుంచి తప్పించారు. ఈమేరకు మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కర్ణాకర్‌రెడ్డిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గంటూరుపల్లిలో విషజ్వరాలు ప్రబలుతున్నప్పటికీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్.. కనీస చర్యలు చేపట్టలేదనే ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. క్రాంతి కుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అందాయి. మండల అధికారులు నివేదిక రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించారు.

## 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ నాయక్, దేవేందర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు నర్సంపేటలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ రెగ్యులర్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, అలాగే జీతాలు పెంచాలని, ప్రతిసంవత్సరం 10 శాతం పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం నాయకులు సింగం రాజేందర్, కటుకూరు శ్రీనివాస్, కొత్తకొండ దేవేందర్, విజయ్, పైలట్ అమర్, రాజేష్, అనిల్, అమర్, రాజ్‌కుమార్, నరేష్, ఈఎంటీ శివకుమార్ పాల్గొన్నారు.

## పార్ట్‌టైం లెక్చరర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పార్ట్‌టైం లెక్చరర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో వర్క్‌లోడు ఉందని, ఈక్రమంలో పార్ట్‌టైం లెక్చరర్లను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపెల్లి మధు, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, వివిధ సంఘాల బాధ్యులు డాక్టర్ వంగ మల్లేశ్, డాక్టర్ బోడ వీరన్న, డాక్టర్ కల్లెబోయిన కుమారస్వామి, డాక్టర్ మద్దిరాల మోహన్ రెడ్డి, డాక్టర్ పాశం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయాలి


రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న అరూరి రమేష్

హన్మకొండ: ఆరోగ్యవంతులందరు రక్తదానం చేయాలని, రక్తదానం మరొకరికి ప్రాణదానమని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అరూరి రమేష్ పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వద్దని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. ఈమేరకు సంఘం నాయకులతో కలిసి కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి కె.జానారెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని గురువారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ విధి విధానాలు ఏర్పాటు చేసి చైర్మన్, పాలకవర్గాన్ని నియమించాలని, ఈడబ్ల్యూఎస్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రెడ్డి సంఘం నాయకులు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, కిరణ్‌రెడ్డి, శరత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, శౌరి అంతిరెడ్డి, సంగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## హసన్‌పర్తిలో 23,402 మంది ఓటర్లు

- పురుషుల కంటే మహిళలే అధికం


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామాల్లో 23,402 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను మండల పరిషత్ అధికారి ప్రవీణ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. మండలంలో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. 11,485 పురుష ఓట్లు నమోదు కాగా, 11,918 మహిళల ఓట్లు ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇతరుల జాబితాలో ఒక ఓటు నమోదై ఉంది. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. నగరంలోని 66వ డివిజన్ హసన్‌పర్తికి చెందిన ఐదు ఓట్లు సీతంపేట గ్రామంలో, ముచ్చర్లకు సంబంధించిన నాలుగు ఓట్లు సీతానాగారంలో భీమారం గ్రామానికి సంబంధించిన ఓట్లు అన్నాసాగరంలో ఉన్నట్లు పార్టీల నాయకులు గుర్తించారు. వారి పేర్లు ఇటు కార్పొరేషన్, అటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉన్నట్లు ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి కర్ణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, సీపీఎం నాయకుడు మోతె లింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

### దళితులు అన్ని రంగాల్లో రాణించాలి



వరంగల్: సమాజంలోని దళితులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ డైరెక్టర్ నేరెళ్ల రాజు సూచించారు. వరంగల్ మండలంలోని కొత్తపేట గ్రామం దుబ్బగుండ్లలో వెలుగు మాదిగ కుల సహకార సంఘం అధ్యక్షుడు ఈసంపల్లి సుదర్శన్ అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెలుగు సహకార సంఘ అభివృద్ధికి దళితులు చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎస్సీ సామాజిక వర్గాలకు శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం, ఎస్సీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కమ్యూనిటీ హాల్‌కు స్థలం, భవన నిర్మాణానికి నిధులు, ప్రభుత్వ ఆరు గ్యారెంటీల అమలు, సైడ్ డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లోని నిధులు కేటాయించాలని తీర్మానించారు.

### రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరెపల్లి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వరంగల్: ఈనెల 10వ తేదీన వరంగల్‌లో జరిగిన జిల్లా స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు, ఒక బాలుడు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పాఠశాల హెచ్‌ఎం టి.వెంకన్న, పీఈటీ పూజారి అశోక్‌గౌడ్ తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆరెపల్లి పాఠశాలకు చెందిన ఎస్కే.గుడియా, యాస్మిన్, గుల్షన్‌తో పాటు కె.శశాంక్ పాల్గొంటున్నట్లు వివరించారు. కాగా, వారిని స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి, ఉపాధ్యాయులు, ఏపీపీ చైర్మన్ డి.సరోజన అభినందించారు.

## కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాషుమియా

ఖిలా వరంగల్: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన ఆటో, ట్రాలీ వాహన డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభలో వారు మాట్లాడారు. రవాణా రంగంలో పనిచేస్తు 20 లక్షల మంది పేద బడుగు బలహీన వర్గాల చెందిన కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈనెల 22, 23వ తేదీల్లో కొత్తగూడెంలో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, దామెర కృష్ణ, జాన్ పాల్, కాశీం, చిరంజీవి, కుమార్, కర్ణాకర్, ఇసాక్, రాజు, రంజిత్, మల్లేశం పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నర్సింహారావు, పీడీఎస్‌యూ బాధ్యులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 30న జరగనున్న పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని, అలాగే అక్టోబర్ 1న నిర్వహించనున్న ఆల్ ఇండియా పీడీఎస్‌యూ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో పేదలకు ఉచిత, నాణ్యమైన విద్య, కామన్ విద్యావిధానం అందించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల విద్య వరకు అంతా వ్యాపారమయం అయిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ నాయకులు అశోక్, సంగీత, అనూష, నరేష్, పృథ్వీ, అజహార్, రమేష్, వీరేందర్, రాజు, సునీల్, వెంకటేష్ పాల్గొన్నారు.

## సర్వ మానవాళికి శాంతిమార్గం


చీరలు పంపిణీ చేస్తున్న మురళీధర్‌రావు, జబ్బార్

ఖిలా వరంగల్: సర్వ మానవాళిని కాపాడుతూ శాంతి మార్గం చూపే దైవం మహ్మద్ ప్రవక్త అని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో వరంగల్ తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ.జబ్బార్ ఆధ్వర్యంలో మిలాద్ – ఉన్ – నబీ వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొండా మురళి హాజరై పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాంద్, ఎండీ.అశ్రఫ్, ఎండీ.మోహిన్, అమ్జద్, హసన్‌అలీబేగ్, జాకీర్, వహిద్, ఎండీ.షరీఫ్, జానీ, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, ఎండీ.అయూబ్, ఎండీ.వసీం, కరాటే ప్రభాకర్, మషూక్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో పర్యావరణానికి ముప్పు


క్రషింగ్ మిషన్‌లో బాటిల్ వేస్తున్న మేనేజర్


హన్మకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న కాలనీవాసులు

కాశిబుగ్గ: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ఈక్రమంలో ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయాలను వాడాలని వరంగల్ రైల్వే స్టేషన్ మేనేజర్ బాలరాజు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా –2024 కార్యక్రమంలో భాగంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలపై ప్రయాణికులకు గురువారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను వాడి ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల కాలుష్యం ఏర్పడి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్, స్టీల్, గాజు వస్తువులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ప్రయాణికులు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బాటిల్ క్రషింగ్ మిషన్‌లో వేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆదర్శ కాలనీలో స్వచ్ఛతా హీ సేవా**

హన్మకొండ / నయీంనగర్: బల్దియా ఆధ్వర్యంలో 53వ డివిజన్ హనుమకొండలోని ఆదర్శ కాలనీలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత పాటిస్తామని కాలనీవాసులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు దామెర శ్రీనివాస్, అనిల్, శాంతి, పారిశుద్ధ్య సిబ్బంది రమేష్, సుధాకర్, సులోచన, భాగ్య, కాలనీ కమిటీ బాధ్యులు ఏనుగుల రాంరెడ్డి, కాసగాని కుమారస్వామి, తీగల చంద్రమౌళి, పున్నం శ్రీను, గునిశెట్టి జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ హాస్టల్‌లో రెజ్లింగ్‌ను ప్రారంభించండి



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో రెజ్లింగ్ క్రీడాకారుల అడ్మిషన్ల ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ.కరీం కోరారు. ఈమేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డిని హైదరాబాద్‌లోని శాట్ కార్యాలయంలోని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరంలో జిల్లాకు రెజ్లింగ్ అకాడమీకి శాట్ అనుమతి ఇచ్చిందని, అకాడమీలో ఎంపిక ప్రక్రియను సైతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పూర్తి చేసిందని తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా హాస్టల్‌లో వసతి కల్పించకపోవడంతో క్రీడాకారులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.